

అధ్వాన్నంగా వాకింగ్ ట్రాక్

నాలుగు సెక్టార్లు... 21 నిర్వాసితకాలనీలు... రెండు వైపులా విస్తరించిన బహుళ అంతస్తుల భవనాలు...గేటెడ్ కమ్యూనిటీలు... వెరసి 50 వేల పైచిలుకు జనాభా ఉన్న అగనంపూడివాసుల ఆరోగ్య రక్షగా, వ్యాయామానికి అవకాశం కల్పిస్తున్న వాకింగ్ ట్రాక్ నిరుపయోగంగా మారింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జీతాలు చెల్లించడానికే మీనమేషాలు లెక్కిస్తున్న తరుణంలో అగనంపూడి వాకింగ్ ట్రాక్ అభివృద్ధిపై చేతులెత్తేసింది. దీంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అగనంపూడి

వాకింగ్ ట్రాక్ తప్పింది

- అడుగు తీసి అడుగేయాలంటే అవస్థలు
- ఎత్తు పల్లాలతో ఛిద్రం
- 15 వందల మందికి ఇదొక్కటే వాకింగ్ ట్రాక్
- ఉక్కు యాజమాన్యం ఎన్‌వోసీ ఇవ్వదు..జీవీఎంసీ అభివృద్ధి చేయదు



రాళ్లు తేలిన ట్రాక్‌పై నడుస్తున్న వాకర్స్

అగనంపూడికి చెందిన నిర్వాసిత కార్మిక సంఘాల నాయకుల ఒత్తిడితో 2018లో ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో ఏలేరు కాలువకు సమీపంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. తరువాత కొన్నాళ్లకు ఇనుప గ్రిల్స్‌తో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. తరువాత ఉక్కు యాజమాన్యం పట్టించుకోపోవడంతో అగనంపూడి వాకర్స్ క్లబ్ సారధ్యంలో నిర్వాహణ భారాన్ని స్వీకరించింది. **అయితే స్టీల్ ప్లాంట్, జీవీఎంసీ చొరవ తీసుకుంటే తప్ప వాకర్స్‌కు మెరుగైన సౌకర్యాలు తీరేలా కనిపించడం లేదు. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం సుమారు 15 వందల మంది వాకర్స్ వాకింగ్** ట్రాక్‌ను వినియోగించుకుంటున్నారు. వాకింగ్ ట్రాక్ నేడు ఎత్తు పల్లాలతో అధ్వానంగా మారింది. అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడాల్సి వస్తోంది.

వర్షం కురిస్తే అంతే..

వర్షం కురిసినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొండవాలు, పక్కనున్న కాలనీ నుంచి వర్షపునీరు వాకింగ్ ట్రాక్ మీదుగా పారుతుంది. ఈ ధాటికి వాకింగ్ ట్రాక్ నామరూపాలు లేకండా కొట్టుకుపోతుంది. తరచూ వాకర్స్ శ్రమదానంతో పూడ్చుకోవాల్సిన పరిస్థితి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈ స్థలానికి సంబంధించి ఎన్‌వోసీ మంజూరు చేస్తే తప్ప తామేమీ చేయలేమని జీవీఎంసీ పాలకులు చేతులెత్తేస్తున్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ కలగజేసుకొని కనీస వసతులు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని వాకర్స్ క్లబ్ కోరుతోంది.

ఇలా చేస్తే..

- వర్షపునీరు వాకింగ్ ట్రాక్‌లోకి ప్రవేశించకుండా ఉండేలా వాకింగ్ ట్రాక్‌కు కొండవైపు, శనివాడ వైపు నుంచి (ఎల్ ఆకారంలో) కాలువలు నిర్మించాలి
- నడక మార్గంలో ఏర్పడిన గుంతలు పూడ్చాలి. మట్టితో వాటిని నింపి, ఎత్తును పెంచి, లెవెల్ చేయించాలి
- తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోడానికి వీలుగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి
- మహిళలు, చిన్న పిల్లల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలి.
- నడక మార్గంలోకి వర్షపునీరు ప్రవహించకుండా చుట్టూ రక్షణగా ఎత్తును పెంచాలి.
- మార్గ మధ్యలో వర్షం, ఎండకు సేదతీరడానికి షెడ్లు ఏర్పాటు చేయాలి.
- వాకర్స్ యోగా, ప్రాథమిక ఎక్సర్‌సైజ్‌లు చేసుకోడానికి మధ్య మధ్యలో బెంచీలు ఏర్పాటు చేయాలి.



వాకింగ్ చేస్తున్న వాకర్స్

జీవీఎంసీ స్పందించాలి



79,85 వార్డుల్లోని అగనంపూడిలో జీవీఎంసీ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఏడేళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. 15 వందల మంది వినియోగిస్తున్న వాకింగ్ ట్రాక్‌లో వసతులు కల్పించడానికి ఎన్‌వోసీ అంటూ కొర్రి పెట్టింది. పాలకపక్షం, అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– మడగల నరసింగరావు, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు

కాలువలు నిర్మించాలి



వర్షపునీటి ప్రవాహాన్ని కట్టడి చేయాలి. వీటికి అనుగుణంగా రెండు వైపులా **నీటి మళ్లింపు కాలువలు** నిర్మించాలి. ట్రాక్ గోతులతో, ఎత్తు పల్లాలతో వాక**ర్స్‌కు ఇబ్బందిగా మా**రింది. వాటిని పూడ్చి గ్రావెల్ ఫిల్ చేసి రోలింగ్ చేసి తెల్ల**వారుజాము, రాత్రివేళ**ల్లో కూడా ఇబ్బంది లేకుండా వాకింగ్‌చేసుకొనే అవ**కాశం కల్పించాలి.**

– కరణం పైడిరాజు, వాకర్స్ క్లబ్ ప్రతినిధి

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి



మహిళల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలి. జీవీఎంసీ అన్ని గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లు ఇప్పటికే ఏర్పాటు చేసింది. 50 వేల జనాభా ఉన్న అగనంపూడిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో సౌకర్యాలు కల్పించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను మెరుగుపరచాలి.

– పల్లవి నాయుడు, వాకర్

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



వాకింగ్ ట్రాక్ చుట్టూ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి. అలాగే వాకింగ్ ట్రాక్‌లో సోలార్ దీపాలు అమర్చాలి. ఎమ్మెల్యే, కార్పొరేటర్ స్పందించి చొరవ తీసుకోవాలి. ఉదయం ఐదు గంటల నుంచి, రాత్రి 8 వరకు ఉద్యోగులు, కార్మికలు, నిర్వాసితులు వారి కుటుంబ సభ్యులతో వాకింగ్ చేస్తున్నారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– ఇల్లూరి ఇందిరాదేవి, వాకర్

క్లుప్తంగా

ఘనంగా జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం



ఎస్టీఎం విభాగం ఉద్యోగులకు ట్రోఫీ అందజేస్తున్న డైరెక్టర్, సీజీఎం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాన్ని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఏకే బాగ్చీ, డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్‌సీ పాండే, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్, డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎస్ ప్రసాద్, సీజీఎం (వర్క్స్) ఆర్. మొహంతి, సీజీఎం ఏకే సోబ్తీ తదితరులు ప్రారంభించారు. బాగ్చీ మాట్లాడుతూ ఇంధన వినియోగం, వ్యయం తగ్గించడానికి ఉద్యోగులు అన్ని విభాగాల్లో మరింత సామర్థ్యంతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంధన పొదుపులో ప్రతిభ చూపిన విభాగాలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, వివిధ విభాగాధిపతులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన మూలనిధికి విరాళాల వెల్లువ



శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రతినిధులకు విరాళాలను అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి అన్నదాన మూల నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం దివ్యక్షేత్రంలో ఎస్.కోటకు చెందిన ఉప్పల ప్రతిజ్ఞ రూ.10 వేలు, అక్కిరెడ్డిపాలేనికి చెందిన నవ్య ఫ్యాబ్రికేషన్స్ అండ్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ధిల్లేశ్ రెడ్డి, రుక్మిణి దంపతులు రూ.10 వేలు, గాజువాక సెల్లిస్ట్ అపార్ట్‌మెంట్‌కు చెందిన వెంకన్న బాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడు వెంకట సత్య రూ.20 వేలు విరాళాలను దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు గోవింద్

అగనంపూడి: వడ్లపూడి నిర్వాసితకాలనీలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ మూర్తులకు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆడారి శ్రీను, కోటి, శివ, పెంటయ్య, రవి, పద్మ, కనకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు భూసేకరణ ఎస్డీసీపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తీరుపై ఉపముఖ్యమంత్రికి స.హ.చ. కార్యకర్త పట్టా రామ అప్పారావు ఫిర్యాదు చేశారు. అగనంపూడిలోని శివాలయానికి గతంలో ఏ మేరకు స్థలం కేటాయించారు, ఎవరి పేరున ఎంత విస్తీర్ణం కేటాయించారో వివరాలు కావాలని గత ఆగస్టులో ఉక్కు ఎస్డీసీ కార్యాలయానికి లేఖ రాస్తే పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు. వీటిపై కలెక్టర్‌కు జీపీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేస్తే సదరు కార్యాలయం నుంచి కూడా నాలుగు నెలలు దాటిన తరువాత సర్వే నంబర్ చెప్పాలని, కేటాయింపులు చేసిన ఆర్‌సీ నంబర్ చెప్పాలని దాటవేత సమాధానం ఇవ్వడంపై రామ అప్పారావు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఆర్టీఐ అంటే అధికారులకు లెక్కలేదని, ప్రభుత్వ అధికారుల వ్యవహార తీరుపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పాలకులు పట్టించుకోపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీజేపీ విధానాలను 'కూటమి' సమర్థించడం శోచనీయం



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికులను ఆర్థికంగా కుంగదీసే కుతంత్రాలకు యాజమాన్యం స్వస్తి పలకాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తి కోసం పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఆర్థికంగా వేధిస్తోందన్నారు. యాజమాన్యం తన వైఖరిని మార్చుకుని కార్మికులకు న్యాయంగా రావాలసిన జీతభత్యాలను తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా 18న ఉక్కు అడ్మిన్ వద్ద జరిగే ధర్నాలో ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తన వాగ్దానాలకు మరిచి కేంద్రంలోని బీజేపీ విధానాలను సమర్థించడం అత్యంత శోచనీయమన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు స్టీల్ యాజమాన్యంపై ఒత్తిడి పెంచి పరిశ్రమ, కార్మికులకు అనుకూల నిర్ణయాన్ని తీసుకునే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్‌లో భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాలను కల్పించగలుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, స్టీల్ సీఐటీయూ నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె. గంగాధర్, కృష్ణమూర్తి, టీవీకే రాజు, కేవీ సత్యనారాయణ, పుల్లారావు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వీర్యానికి కేంద్రం కుట్ర



మాట్లాడుతున్న ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా వారి అనుయాయులకు కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో ఆది నుంచి కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో 1,402 రోజులుగా రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం..కార్మికులపై కక్ష సాధింపులకు దిగుతోందని, వీటిలో భాగమే జీతాలు చెల్లించకపోవడమన్నారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం ఉక్కును పరిరక్షిస్తామని నమ్మబలుకుతూ మరోవైపు కార్మికుల గొంతు నొక్కాలని చూస్తోందన్నారు. మూడు మాసాలుగా ఉక్కు కార్మికులకు, ఆరు నెలలుగా కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించలేదని, ఈ విషయంలో కూటమి నేతలు నోరు మెదపకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఈ నెల 18లోగా జీతాలు చెల్లించకపోతే కార్మికులు, కుటుంబాలతో కలిసి పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, వి.శ్రీనివాసరావు, కారు రమణ, పీవీ రమణమూర్తి, కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్సవ సారె ఊరేగింపు



అగనంపూడి: గౌరీ పరమేశ్వర్లు ఉత్సవాలను పురస్కరించుకొని 87వ వార్డు కణిత కాలనీలోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో వివిధ పిండి వంటకాలు, ఫలాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 518 రకాల పిండి వంటకాలు, ఫలాలతో మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు. కణితి గవర వీధి, పద్మశాలి వీధి, రాజులపాలెం, ఈసేవా సెంటర్, సిద్ధార్థనగర్, వడ్లపూడి, అప్పికొండకాలనీ, ముస్తాఫా జంక్షన్‌ల మీదుగా ఊరేగింపు సాగింది.

టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన



దయాల్‌నగర్ టిడ్కో గృహాల వద్ద కుటుంబాలతో కలిసి ఆందోళన చేస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు



చీకట్లో అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు శనివారం కదం తొక్కారు. కనీస వసతులు కల్పించకుండా ఈ నెల 11న దయాల్‌నగర్‌లో టిడ్కో ఇళ్లు తమకు అప్పగించారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఉందన్నారు. కనీసం ఎలా ఉన్నారని అడిగేనాథుడే కరువైయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తూ పెదగంట్యాడ దయాల్‌నగర్ కేవీల్‌రావు నగర్ సమీపంలో ఉన్న టిడ్కో గృహాల వద్ద శనివారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేమంతా కుటుంబాలతో వచ్చి దయాల్‌నగర్ టిడ్కో గృహాల్లో నివాసం ఉంటూ నానా అవస్థలు పడుతున్నామని, ఈ విషయం తెలిసి కూడా అటు అధికారులు..ఇటు నాయకులు మా వద్దకు రాకపోవడం దారుణమన్నారు. తాగునీరు ఇవ్వకున్నా.. రోడ్లు వేయకపోయినా, కాలువలు నిర్మించకపోయినా ఇక్కడే ఉంటున్నామని, ఇకపై ఇక్కడే ఉంటామని.. చావైనా బతుకైనా ఇక్కడేనని తేల్చిచెప్పారు. సొంతింటి కలను నిజం చేస్తారని 2017 నుంచి ఎదురు చూశామని, కట్టిన ఇళ్లు మంజూరు చేయకపోయినా..బ్యాంక్ రుణాలు చెల్లిస్తున్నామన్నారు. ఓ వైపు ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే మరో పక్క బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కేటాయించిన ఇళ్లకు సంబంధించి వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు. కనీస సదుపాయాలు రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ అందరి నాయకులు, అధికారులు చుటూ తిరిగామని ఎవ్వరూ మమ్మల్ని పట్టించుకోవడం లేదని కన్నీరు మున్నీరయ్యారు. సహనం కోల్పోతున్నామని సదుపాయాలు కల్పించేవరకూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ధనుర్మాస ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ధనుర్మాసం కార్యక్రమాల పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ ఈకే చారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నెలరోజుల పాటు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నామని, వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటలక్ష్మి, సాయిబాబు నాయుడు, నరసింగరావు మాస్టార్, కృష్ణారావు, మేడిశెట్టి ఉమా మహేశ్వరరావు, గొల్లవిల్లి వెంకటరావు, సత్యనారాయణ, గురునాథ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి

అగనంపూడి: దత్త జయంతిని పురస్కరించుకొని అగనంపూడి షిర్డీసాయి బాబా ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడా హారతి,విభూతి అభిషేకం, సహస్ర నామార్చన గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, రామారావు, పీఎల్ఎన్‌రాజు, పి.సత్యనారాయణ, డి.సత్యలక్ష్మి, ఆర్.సత్యశ్రీదేవి, జి.లీలావతి, పి.పంకజ, కుమారి, పద్మావతి, సూరీడమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి షణ్ముఖరావు

అక్కిరెడ్డిపాలెం: లోక్ అదాలత్‌లతో కేసులకు సత్వర పరిష్కారం లభించనుందని 8వ అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ గాజువాక జడ్జి జి.షణ్ముఖరావు అన్నారు. శనివారం గాజువాక కోర్టులో ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో 884 కేసుల్లో రూ.6,13,82,340 జరిమానాల రూపంలో వసూలు చేశామన్నారు. కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ సులువైన మార్గమన్నారు. కార్యక్రమంలో 8వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎస్.కవిత, అడ్వకేట్ కం లోక్ అదాలత్ మెంబర్ కె.సీతామహాలక్ష్మి, సోషల్ వర్కర్ వి.వినోద్ కుమార్, గాజువాక 3వ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జడ్జి వి.పల్లవి, లోక్ అదాలత్ మెంబర్, జడ్జి ఈ.గిల్‌బర్ట్, గాజువాక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఈ.రాజేంద్రబాబు, లోక్ అదాలత్ మెంబర్ జి.వి.ఎస్.ప్రసాద్, గాజువాక సివిల్ జడ్జి వై.శ్రీలక్ష్మి, లోక్ అదాలత్ మెంబర్ పి.వి.వి.రవికుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ



ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు, ఆలయ అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి శ్రీకారం

పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీ గరుడాద్రి కొండపై వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయం ముఖద్వారం నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. దాతలైన అప్పలసూరి వెంకటసుబ్బరాజు, రామలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఈ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గాజువాక ఎస్ఐ పార్థసారథి, పిట్ట సూర్య ప్రకాష్ రెడ్డి, పైడిరత్నం, చుక్కా శ్రీరాములు, జగదీశ్వరి, మిత్తని అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.